GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : శుక్రవారం- అక్టోబర్, 04-2024 పేజీలు : 3

10 న కేబినెట్ సమావేశం

టీ మీడియా, అక్టోబర్ 3,అమరావతి బ్యూరో :

రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం ఈనెల 10వ తేది ఉదయం 11 గంటలకు సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో జరుగనుంది. ఈ మేరకు బుధవారం సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ వివిధ శాఖలకు జారీ చేసిన సర్క్యులర్‌లో హెచ్‌ఓడిలు 8వ తేది సాయంత్రం 4 గంటలలోగా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. మంత్రివర్గ సమావేశంలో మచిలీపట్నంపోర్టు అభివృద్ధి, చెత్త పన్ను రద్దుకు ఆమోదం, పోలవరం, అమరావతి నిర్మాణాలు, ఇంటింటికీ మంచినీటి కుళాయిలు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, డ్వాక్రా సంఘాల తరహాలో స్వచ్ఛ సేవకుల కోసం ప్రత్యేక గ్రూపులు ఏర్పాటు, సూపర్ సిక్స్ పథకాల అమల్లో సంక్రాంతి నుంచి పి-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం, పేదరికంలేని సమాజం ఏర్పాటు దిశగా ఈ కార్యక్రమాన్ని తీసుకెళ్లడం లాంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశమున్నట్లు తెలిసింది.

ఫామ్ హౌస్‌ను కాపాడుకోవడానికే

ఈ రాజకీయాలు

డిజిటల్ కార్డు శ్రీరామ రక్ష

- ఒకే కార్డులో అన్ని వివరాలు
- సబితమ్మ.. మీ ఫామ్ హౌస్ లెక్క కూడా ఉంద
- కేటీఆర్.. హరీశ్‌పై మండిపడ్డ రేవంత్ రెడ్డి

టి మీడియా, అక్టోబర్ 3,హైదరాబాద్ బ్యూరో

పేదలను అడ్డం పెట్టుకొని ఫాం హౌస్ లు కాపాడాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ఆక్రమించిన వారికి ఎలా సాయం చేద్దాం అనేది చెప్పండి? డబుల్ బెడ్ రూం ఇచ్చామని, చదువుకు స్కూల్ పెడుతున్నామని, ఈటెల కు వచ్చిన దుఃఖం ఏంది? వాళ్ళు బాగుండటం ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. చెరువుల్లో నిర్మాణాలు తొలగించాల్సిందే అని, నాలా లాపై నిర్మాణాలు తొలగించాల్సిందే అని స్పష్టం చేశారు. మూసీ బాధితులకు ఇల్లు తో పాటు, ఖర్చులకు రూ.15 వేలు ఇచ్చామన్నారు.సికింద్రాబాద్ లోని సిఖ్ కాలనీలో ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ పైలట్ కార్యక్రమాన్ని నేడు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నల్గొండలో అడుగు పెట్టండి.. మూసీ తో పంటలు ఎంత కాలుష్యమవుతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. . నల్గొండ ప్రజా కోసం ప్రక్షాళన చేయాలన్నారు. తాను భవిష్యత్ కోసం ఆలోచన చేస్తున్నాని, అయితే కేటీఆర్.. అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. సబితమ్మ పేద అరుపులు అరవకు అని అన్నారు. మీ ముగ్గురు కొడుకుల ఫాం హౌస్ లు లేవా..? అని ప్రశ్నించారు. మీ ఫామ్ హౌస్ ల లెక్క కూడా ఉందని చెప్పారు. హరీష్ రావుకు అమీన్ పూర్ లో ఫాం హౌజ్ ఉంది కదా? అది ఆక్రమం కాదా..? అని ప్రశ్నించారు.

గత ప్రభుత్వం చేసింది- తప్పులు.. అప్పులు

గత ప్రభుత్వం చేసింది రెండే రెండు అని, ఒకటి తప్పులు.. రెండోది అప్పులు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అప్పులు..తప్పులతో రాష్ట్రం నిండా మునిగిందని చెప్పారు. సబితా ఇంద్రారెడ్డి ఫాం హౌస్ కూలగొట్టాలా వద్దా..? అని ప్రశ్నించారు. కిరాయి మనుషులతో.. బావ బామ్మర్ది లు ధర్నాలు చేయిస్తున్నారని ఆరోపించారు. మూసీని అడ్డం పెట్టుకుని ఎన్ని రోజులు రాజకీయం చేస్తారని, మూసీ పేదలకు ఇండ్లు ఇవ్వాలా వద్దా? అని ప్రశ్నించారు. నమ్మి మోస పోయినా పేదలకు పరిహారం ఇద్దాం రండి అన్నారు.

మోదీ దగ్గరకు పోదాం- ఈటల రావాలి..

ఎంపీగా ఉన్న ఈటల రాజేందర్‌పై రేవంత్ డిపడ్డారు. ప్రధాని మోదీ సబర్మతి రివర్ అభివృద్ధి చేసుకోవచ్చు.. తెలంగాణలో మూసీ నది అభివృద్ధి చేస్తామంటే%%% చేయొద్దంటే ఎలా? అని ప్రశ్నించారు. కేటీఆర్..హరీశ్ ముందు రోజు మాట్లాడతారని, ఆ మరుచటి రోజు వాళు మాట్లాడిన కాగితం పట్టుకుని ఈటెల రాజేందర్ వ్యాఖ్యలు చేస్తారని చెప్పారు. పార్టీ మారినా పాత పార్టీ గత్తర వాసన పోవడం లేదని విమర్శించారు.

సెక్రటేరియట్‌కు రండి-చెరువులు ఆక్రమించుకునేదెవరో చర్చిద్దాం

కేటీఆర్, హరీశ్ ఇదరూ సెక్రటేరియట్‌కు రండి అని, చెరువు ఎవరు ఆక్రమించుకున్నారో చర్చిద్దామని రేవంత్ అన్నారు. హైదరాబాద్ చెరువుల లెక్క తీద్దామని, ఎవరు ఆక్రమణ చేశారు.. ఎవరు వెంచర్ వేశారు.. అనేది లెక్క తీద్దాం అని అన్నారు. తాగు నీరు అందించే చెరువుల్లో ఫాం హౌస్ కట్టుకున్నారని మండిపడ్డారు.

వన్ స్టేట్-వన్ కార్డ్ తో మరో కొత్త విప్లవం

తెలంగాణలో వన్ స్టేట్-వన్ కార్డ్ తో మరో కొత్త విప్లవానికి కాంగ్రెస్ ప్రభుత్వం నాంది పలుకుతోందని, ఫ్యామిలీకి రక్షణ కార్డుగా డిజిటల్ కార్డు ఉంటుందని రేవంత్ అన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోని రెండు గ్రామాల్లో ఈ పైలట్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ పైలట్ సర్వేను ఐదు రోజుల్లో పూర్తి చేసి.. ఈ విధానంలో గల మార్పులు చేర్పులను గమనించి, రాష్ట్రమంతటా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం దగ్గర ఉన్న 30 శాఖల సమాచారాన్ని క్రోడీకరించి ఫ్యామిలీ డిజిటల్ కార్డులు రూపొందిస్తున్నామని వెల్లడించారు.

ఇంటి మహిళయే ఇంటి యజమానురాలి

మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని.. అందులో భాగంగానే ఫ్యామిలీ డిజిటల్ కార్డుల్లో ఆ ఇంటి మహిళను ఇంటి యజమానురాలిగా ఉంచుతామని సీఎం తెలిపారు. రేషన్ కార్డులు వేరు, ఫ్యామిలీ డిజిటల్ కార్డులు వేరని.. ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డుల్లో కుటుంబంలోని ప్రతీ ఒక్కరి ఆరోగ్య వివరాలతోపాటు ఆ ఇంట్లో వారు పొందుతున్న పథకాలన్నింటి వివరాలు ఉంటాయన్నారు.

ఎస్‌బీఐ నకిలీ బ్రాంచ్ తెరిచి.. లక్షల్లో మోసం

టీ మీడియా, అక్టోబర్ 3 ,రాయ్‌పూర్:

మరో కొత్త తరహా మోసం వెలుగులోకి వచ్చింది. ఏకంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పేరుతో నకిలీ బ్రాంచ్‌ను తెరిచారు. కొందరు వ్యక్తుల నుంచి డబ్బులు వసూలు చేసి ఉద్యోగులుగా నియమించారు. ఆ బ్రాంచ్‌లో బ్యాంకు కార్యకలాపాలు కూడా ప్రారంభించారు. గ్రామస్తుల నుంచి డబ్బులు జమ చేసుకున్నారు. సమీపంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌కు సమాచారం అందడంతో ఈ మోసం బయటపడింది. ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కొందరు వ్యక్తులు భారీ బ్యాంకింగ్ మోసాన్ని పక్కాగా ప్లాన్ చేసి అమలు చేశారు. మారుమూల ప్రాంతమైన ఛపోరా గ్రామంలో ఏకంగా ఎస్‌బీఐ పేరుతో నకిలీ బ్రాంచ్‌ను తెరిచారు. కాంప్లెక్స్‌లోని షాపును అద్దెకు తీసుకున్నారు. నిజమైన బ్యాంకుగా నమ్మించేందుకు ఫర్నీచర్‌తోపాటు క్యాష్ కౌంటర్ వంటివి ఏర్పాటు చేశారు.కాగా, బ్యాంకు ఉద్యోగాల పేరుతో రెండు నుంచి ఆరు లక్షల వరకు మహిళలతో సహా ఆరుగురు వ్యక్తుల నుంచి డబ్బులు దండుకున్నారు. వారికి నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇవ్వడంతోపాటు శిక్షణ కూడా ఇచ్చారు. బయోమెట్రిక్ హాజరుతో వారు బ్యాంకు విధులకు హాజరయ్యారు. ఎస్‌బీఐ కొత్త బ్రాంచ్ ఏర్పాటు పట్ల గ్రామస్తులు కూడా సంతోషం వ్యక్తం చేశారు. లావాదేవీల కోసం ఆ బ్రాంచ్‌కు వెళ్లారు.అయితే సుమారు పది రోజుల పాటు పని చేసిన ఎస్‌బీఐ నకిలీ బ్రాంచ్ గురించి సమీపంలోని దబ్రా బ్రాంచ్ మేనేజర్ దృష్టికి వచ్చింది. ఈ బ్రాంచ్ పట్ల ఆయన అనుమానం వ్యక్తం చేశారు. దీంతో సెప్టెంబర్ 27న ఎస్‌బీఐ అధికారులు, పోలీసులు కలిసి అక్కడకు వెళ్లారు. అచ్చం ఎస్‌బీఐ బ్రాంచ్ మాదిరిగా కనిపించడంతోపాటు బ్యాంకింగ్ సేవలు నిర్వహిస్తున్న నకిలీ బ్రాంచ్‌ను చూసి వారు కంగుతిన్నారు.మరోవైపు నకిలీ బ్రాంచ్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు నకిలీ నియామక పత్రాలు ఇచ్చినట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఈ నకిలీ బ్రాంచ్‌కు మేనేజర్‌గా వ్యవహరించిన పంకజ్‌తోపాటు రేఖా సాహు, మందిర్ దాస్‌తో సహా నలుగురు ఈ స్కామ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మోసంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామస్తులు డబ్బులు పోగొట్టుకోగా, నిజంగా బ్యాంకు ఉద్యోగమని నమ్మి నియామక పత్రాలు పొందిన వారు కూడా చిక్కుల్లో పడ్డారు.

ఘనంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

- సమిష్టి తో ఉత్సవాలు విజయవంతం చేద్దాం
- సమన్వయమే కీలకం
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

టీ మీడియా, అక్టోబర్ 3, విజయవాడ: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు విజయవాడ ఇంద్రకీలాద్రిపై గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం సన్నిధిలో దేవీ నవరాత్రుల ఉత్సవాలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. తాను ఇప్పుడే దేవాలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలలో ప్రత్యక్షంగా పర్యటించానన్నారు. భక్తుల దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్లు, సురక్షిత మంచినీటి పంపిణీ కేంద్రాలు, పారిశుధ్య ఏర్పాట్లు వంటి అంశాలలో చాలా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. అమ్మవారి దర్శనం కోసం వస్తున్న భక్తులు తొక్కిసలాటకు గురికాకుండా అప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆలయ కార్య నిర్వహణ అధికారిని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో బాధ్యతలు నిర్వహిస్తే ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. ప్రధానంగా గత ఏడాది తలెత్తిన సమస్యలను గుర్తించి ఆయా సమస్యలు పునరావృతం కాకుండా దేవాదాయ శాఖ అధికారులు వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించామన్నారు.

దర్శనం కోసం ఏర్పాటు చేసిన ఐదు క్యూలైన్లలో రెండు క్యూ లైన్లు సామాన్య భక్తుల ఉచిత దర్శనం కోసం, వంద రూపాయల టికెట్ల ద్వారా దర్శించినందుకు టికెట్ల ద్వారా దర్శించుకునేందుకు ఒక వరుస, 300 రూపాయల టికెట్లతో దర్శించుకునే వారి కోసం ఒక వరుస, మూడవది 500 రూపాయల క్యూ లైన్లుగా ఏర్పాటు చేశామన్నారు. దర్శనార్థం వచ్చే భక్తులు కొండ కింద ఉన్న అన్నదాన భవనంలో అన్న ప్రసాదాలు స్వీకరించాలన్నారు. మూలా నక్షత్రం రోజున కనకదుర్గ అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలను సమర్పిస్తారని తెలిపారు. నుంచి ఉత్సవాలు ముగిసేంతవరకు తొమ్మిది రోజులు దుర్గా ఘాట్ వద్ద కృష్ణమ్మకు నవ హారతులు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్‌రామరావు మాట్లాడుతూ.. వివిధ శాఖల అధికారులు నిరంతరం ప్రతి ఒక్క భక్తుడు సంతృప్తికరమైన దర్శనం చేసుకునేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటున్నారని వివరించారు.

అనుకోకుండా ఓ కుటుంబాన్ని ప్రస్తావించా..

- ఎవరిపైనా ద్వేషం లేదు
- మంత్రి కొండా సురేఖ.

టి మీడియా, అక్టోబర్ 3,హైదరాబాద్ బ్యూరో

:మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.. బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం సమంతా.. నాగచైతన్య విడాకులపై మాట్లాడిన కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేయడం ఇటు రాజకీయాల్లో .. అటు సినీ ఇండస్ట్రీలో ప్రకంపనలు రేపాయి.మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి.. బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం సమంతా.. నాగచైతన్య విడాకులపై మాట్లాడిన కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేయడం ఇటు రాజకీయాల్లో .. అటు సినీ ఇండస్ట్రీలో ప్రకంపనలు రేపాయి.. కొండాసురేఖ వ్యాఖ్యలపై అక్కినేని నాగార్జున, టాలీవుడ్ ప్రముఖులు.. గరం గరం అవుతున్నారు.. ఈ తరుణంలో కొండా సురేఖ క్షమాపణలు కూడా చెప్పారు. అంతేకాకుండా.. హన్మకొండలో మీడియాతో కూడా మాట్లాడారు.. తాను ఎందుకు అనాల్సి వచ్చిందో వివరణ ఇస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో భావోద్వేగానికి గురైనట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆయనపై విమర్శలు చేసే క్రమంలో అనుకోకుండా ఓ కుటుంబాన్ని ప్రస్తావించానన్నారు. తనకు ఎవరిమీద వ్యక్తిగత ద్వేషం, కోపం లేదన్నారు. ఆ కుటుంబ సభ్యులు పెట్టిన పోస్టు చూసి చాలా బాధపడ్డానని.. దీనిపై తాను పడిన బాధను మరొకరు పడకూడదని వెంటనే స్పందించాన్నారు.ఏ విషయంలో తాను బాధపడ్డానో.. ఆ విషయంలో మరొకరిని నొప్పించానని తెలిసి వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నానని మంత్రి పేర్కొన్నారు. తాను పడిన బాధ వేరేవాళ్లు పడకూడదని ఈ నిర్ణయం తీసుకున్నానని కొండా సురేఖ పేర్కొన్నారు. అప్పుడే దీనిపై స్పందిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశానని.. కేటీఆర్ విషయంలో మాత్రం తగ్గేదేలేదని.. ఆయన క్షమాపణ చెప్పాల్సిందేనని పేర్కొన్నారు. కేటీఆర్ లీగల్ నోటీసుపై న్యాయపరంగా ముందుకెళ్తామని కొండా సురేఖ పేర్కొన్నారు.కాగా నాగచైతన్య-సమంత కేటీఆర్ వల్లే విడాకులు తీసుకున్నారంటూ కొండా సురేఖ బుధవారం ఆరోపించారు. ఆమె కామెంట్స్ పై పలువురు సినీ ప్రముఖులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్న విషయం తెలిసిందే.. ఆమె వ్యాఖ్యలపై అక్కినేని కుటుంబం ఆగ్రహం వ్యక్తంచేసింది. మంత్రి కొండా సురేఖకు లీగల్ నోటీసులు పంపేందుకు అక్కినేని నాగార్జున సిద్ధమవుతున్నారు.

గీత దాటితే వేటు తప్పదు..

-లూప్ లైన్‌లోకి ముగ్గురు సీఐలు

-13 మంది ఎస్ఐలు

టీ మీడియా, అక్టోబర్ 3 ,హైదరాబాద్:

తెలంగాణలో పోలీస్ ప్రక్షాళన షురూ అయ్యింది. అక్రమ దందాకు వత్తాసు పలుకుతున్న పోలీసు అధికారులపై వేటు పడింది. మల్టీజోన్-2 లోని తొమ్మిది జిల్లాలలో అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయడంలో విఫలమైన ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలను వి ఆర్ లో పెడుతూ మల్టీజోన్-2 ఐజీపీ వి. సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో ఇప్పటికే సదరు అధికారులను బదిలీ చేయడం జరిగింది.ప్రస్తుతం వేటు పడినవాళ్ళలో సంగారెడ్డి రూరల్, తాండూర్ రూరల్, తాండూరు టౌన్ సీఐలతోపాటు వీపనగండ్ల, బిజినేపల్లి,

మిగతా 3లో

ఐదేళ్లలో 200 రైల్వే ప్రమాదాలు

- భారతీయ రైల్వే

టీ మీడియా, అక్టోబర్ 3,ఢిల్లీ:

గత ఐదేళ్లలో జరిగిన 200 రైల్వే ప్రమాదాల్లో 351 మంది మృతి చెందగా, 970 మంది గాయపడ్డారని 17 రైల్వే జోన్‌ల నుండి సేకరించిన డేటా వివరాలను భారతీయ రైల్వే వెల్లడించింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం కోల్‌కతాలోని పిఎస్‌యు బ్రైత్‌వైట్ అండ్ కోని తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడుతూ.. 10 సంవత్సరాల క్రితం సంవత్సరానికి 171 ప్రమాదాలు జరుగుతుండగా, ఇప్పుడు అది 40 ప్రమాదాలకు తగ్గిందన్నారు. ఐదేళ్లలో(2019-20 నుండి 2023-24 వరకు) రైల్వే శాఖ ?32 కోట్ల పరిహారం అందించిందన్నారు. ఈ మొత్తంలో రైలు ప్రమాదాల్లో మరణించిన వారి బంధువులకు ?26.83 కోట్లు, గాయపడిన వారికి ?7 కోట్లు అందించారని పేర్కొన్నారు. ఆర్టీఐ కార్యకర్త వివేక్ పాండే దాఖలు చేసిన సమాచార హక్కు ప్రశ్నకు సమాధానంగా ఈ డేటా షేర్ చేశారు.గత ఏడాది జూన్‌లో బాలాసోర్ మూడు రైళ్లు ఢీకొన్న దుర్ఘటనతో సహా జరిగిన 10 ప్రమాదాల్లో 297 మంది మరణించగా, 637 మంది గాయపడ్డారు. దీని తర్వాత ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో 15 ప్రమాదాలు జరగడంతో 20 మంది మరణించగా, 79 మంది గాయపడ్డారు. జూలైలో జరిగిన పెద్ద ప్రమాదం కాంచనజంగా ఎక్స్‌ప్రెస్ ప్రమాదం. ఇది 10 మంది ప్రాణాలను బలిగొంది. సెంట్రల్ రైల్వే జోన్‌లో 22 ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. తూర్పు రైల్వేలో 12 ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, తొమ్మిది మంది గాయపడగా, ఈస్ట్ సెంట్రల్ జోన్‌లో 18 ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందగా 33 మంది గాయపడ్డారు.నార్త్ సెంట్రల్ జోన్‌లో 21 ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా 49 మంది గాయపడగా, ఉత్తర రైల్వేలో 25 ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. దక్షిణ మధ్య రైల్వేలో 12 ప్రమాదాల్లో ఒకరు మరణించగా, 26 మంది గాయపడ్డారు. సౌత్ ఈస్ట్ సెంట్రల్ జోన్‌లో తొమ్మిది ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా, ఆరుగురు గాయపడ్డారు.నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వేలో తొమ్మిది ప్రమాదాల్లో తొమ్మిది మరణాలు, 45 మంది గాయపడగా, నార్త్ వెస్ట్రన్ జోన్‌లో 70 మంది గాయాలతో పది ప్రమాదాలు జరిగాయి. వెస్ట్ సెంట్రల్ జోన్‌లో ఏడు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, తొమ్మిది మంది గాయపడ్డారు. పశ్చిమ జోన్‌లో 12 ప్రమాదాల్లో ముగ్గురు మరణించారు.సురక్షిత జోన్‌లలో రెండు ప్రమాదాలు జరిగిన ఈశాన్య జోన్, మూడు ప్రమాదాలు జరిగిన కొంకణ్ రైల్వే, నైరుతి %ఉ% దక్షిణ రైల్వే జోన్‌లు వరుసగా తొమ్మిది మరియు నాలుగు ప్రమాదాలు నమోదయ్యాయి. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని రైల్వే మంత్రిత్వ శాఖ డేటా వెల్లడించింది.

హెచ్‌సీఏలో 20 కోట్ల ఫ్రాడ్.

అజారుద్దీన్‌కు ఈడీ సమన్లు

టీ మీడియా, అక్టోబర్ 3 ,హైదరాబాద్

: హైదరాబాద్ క్రికెట్ సంఘంతో లింకున్న మనీల్యాండరింగ్ కేసులో.. మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు ఇవాళ ఈడీ నోటీసులు జారీ చేసింది. 2020 నుంచి 2023 వరకు హెచ్‌సీఏలో జరిగిన అక్రమాలపై ఉప్పల్ పోలీస్ స్టేషన్లో పలు ఫిర్యాదులు ఉన్నాయి. ఆ సమయంలో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజార్ పనిచేశారు. క్రికెట్ బాల్స్, బకెట్ చైర్స్, జిమ్ పరికరాలకు కొనుగోళ్లలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉప్పల్లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈసీఆర్ నమోదు చేసింది ఈడి. ఈ విషయం ఇప్పటికే అజారుద్దీన్ బెయిల్ పొందారు. అయితే తాజాగా విచారణ చేపట్టాలని ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీ చేసింది.భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, మాజీ ఎంపీ, ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్

మిగతా 3లో

ఈవెంట్ లో పాల్గొన్న డా. జిల్లెల ఆదిత్య రెడ్డి

టీ మీడియా, అక్టోబర్ 3, వనపర్తి బ్యూరో :
తమిళనాడు కోయంబత్తూర్ లో ఏఐపీసీ ఈవెంట్ లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఏఐపీసీ మెడికల్ విభాగం కో ఆర్డినేటర్, వనపర్తి నియోజకవర్గ యువ నాయకులు డా. జిల్లెల ఆదిత్య రెడ్డి.
మన జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కోయంబత్తూర్ లో నిర్వహించిన ఏఐపీసీ ఈవెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐపీసీ చైర్మన్ శ్రీ ప్రవీన్ చక్రవర్తి , మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి చిందంబరం, ప్రధాన మంత్రి మోడీ మాజీ సలహాదారు డా. రతిన్ రాయ్ పాల్గొన్నారు.

నవరాత్రుల పూజలు ప్రారంభించిన అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు

టీ మీడియా, అక్టోబర్ 3, వనపర్తి బ్యూరో :
నవరాత్రుల పూజలు ప్రారంభించిన వనపర్తి రాజుల వారసులు. వారితో కలిసి పూజలో పాల్గొన్న అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ రాజావారికి శాలువాలతో సత్కరించి, తరాలుగా వస్తున్న సాంప్రదాయాలను కొనసాగిద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు.ప్రతి సంవత్సరం రాజా రామేశ్వరరావు బంగ్లా పరిధిలో కొనసాగే నవరాత్రి ఉత్సవాలను రాజుల వారసులు కొనసాగించడం పరిపాటి. అందులో భాగంగా గురువారం రాజా కృష్ణదేవరరావు వారి కుటుంబంతో కలిసి పూజలు ప్రారంభించారు. వనపర్తి ప్రజల అభివృద్ధి, సుఖశాంతులు వేల్లివిరచాలని ఈ పూజల అర్థం. ఈసారి అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు కూడా పాల్గొన్నారు. దసరా పండగ వరకు జరిగే ఈ పూజలు దసరా వరకు కొనసాగుతాయని తెలిపారు. పూజల అనంతరం వారికి అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు రాజుల వారసులను ఘనంగా సత్కరించడం జరిగింది. ఇందులో పాల్గొన్నవారు అఖిల పక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, డి.ఎస్.పి టౌన్ అధ్యక్షులు గంధం భరత్, బీసీ నాయకులు గౌనికాడి యాదయ్య, లోక్ సత్తా జిల్లా ఇన్చార్జ్ సూగూరు రాజ్ కుమార్, నాయకులు శివకుమార్, బల్మూరి భాస్కర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కాలనీలో మౌలిక వసతులు

కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి..

టీ మీడియా, అక్టోబర్ 3, మహానంది
:మహానంది మండలం అబ్బిపురం గిరిజన కాలనీని ఐటీడీఏ లో చేర్చి,ఇంటి నిర్మాణాలు, రోడ్డు, వీధి కాలువలు. మరుగుదొడ్డు లాంటి మౌలిక వసతులు కల్పించాలని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి డిమాండ్స్ తో కూడిన వినతి పత్రంసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సిపిఐ మండల కార్యదర్శి ఆర్ సామేలు అందజేశారు. గురువారంగిరిజన సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యేని కోరారు.ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు గురుమూర్తి, శాఖ కార్యదర్శి లక్ష్మయ్య, మహిళా నాయకురాలు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

టీ మీడియా, అక్టోబర్ 3, మహానంది:
మహానంది గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీయువ నేత సూరే శ్రీనివాసులు గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. గురువారం శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి శ్రీనివాసులు స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడవద్దు అండగా ఉంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట తెలుగుదేశం పార్టీ శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త బన్నురు రామలింగారెడ్డి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

టీ మీడియా, అక్టోబర్ 3, వనపర్తి బ్యూరో :
మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎం.వి.యస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న జరిగే అంతర్జాతీయ తెలుగు సాహిత్య సదస్సును జయప్రదం చేయాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ కోరారు. దీనికి సంబంధించి ఒక బ్రోచర్ ను గురువారం వనపర్తి లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ సుప్రసిద్ధ సాహితీవేత్త స్వర్గీయ "డా. కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలనం" అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ సదస్సు ఆఫ్లైన్నైవిధానంలో జరుగుతుందనిఆసక్తిగల సాహితీవేత్తలుపాల్గొనవచ్చనిసూచించారు.కపిలవాయిలింగమూర్తివ్యాసరచనలలోసామాజిక,చారిత్రక,ఆధ్యాత్మిక,కులవృత్తులు,దేవాలయాల,స్థానిక చరిత్ర, సాహిత్య విమర్శ తదితర అంశాలపై 5 పేజీలకు మించకుండా తమ పరిశోధక వ్యాసాలను ఈ నెల 15 వ తేదీలోగా కళాశాల తెలుగు విభాగానికి పంపవలసి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు బైరోజు చంద్ర శేఖర్,డా.అంబటి భాను ప్రకాష్, డా.బి.శ్యాం సుందర్, ప్రధానోపాధ్యాయులు గణేష్ కుమార్, వరప్రసాద్ రావు,ఉపాధ్యాయ సంఘాల నాయకులు బొద్దా రెడ్డి,మహిపాల్ రెడ్డి,రవీందర్ గౌడ్, పసుపుల ప్రసాద్,శ్రీనివాసులు, పాల్గొన్నారు.

వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

-శైలపుత్రి దుర్గ అలంకారంలో కామేశ్వరి అమ్మవారు..



టీ మీడియా, అక్టోబర్ 3, మహానంది:
మహానంది పుణ్యక్షేత్రంలో కొలువైన శ్రీ కామేశ్వరి అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం శైలపుత్రి దుర్గ అలంకారంలో కామేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేద పండితులు ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనంతో పంచగవ్య ప్రాశన చేసి, అనంతరం శ్రీ కామేశ్వరీ మహానందీశ్వర స్వామి వార్ల అనుజ్ఞ తీసుకొని, ఋత్విక్వరుణ,దీక్షాధారణ, అఖండ స్థాపనతో మొదటిరోజు కార్యక్రమాలు మొదలుపెట్టారు. దాతలచే చండీ హోమం, శ్రీ చక్రార్చన పూజలు వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు క్షేత్రంలోని స్వామి కళ్యాణ మండపంలో సహస్ర దీపాలంకరణ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ కామేశ్వరి అమ్మవారు శైలపుత్రి దుర్గ అలంకారంలో, భక్తులకు దర్శనం ఇస్తూ ఆలయ మాడవీధుల వెంట గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. తదనంతరం ఉభయ దాతలచే రుత్విక్కులు సామూహిక కుంకుమార్చన పూజలు, మంత్రపుష్పములు తీర్థ ప్రసాద వినియోగం ఉభయ దాతలకు వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో నల్ల కాల్వ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ మధు, దాతలు వై. లక్ష్మీ మధు, సుధా దంపతులు, ఆలయ అధికారులు, వేద పండితులు రవిశంకర అవధాని, అర్జున శర్మ, ఆంజనేయ శర్మ, నాగేశ్వర శర్మ అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జైలు ఖైదీల్లో కులవివక్ష సరికాదు: సుప్రీంకోర్టు

టీ మీడియా, అక్టోబర్ 3 ,న్యూఢిల్లీ:
జైళ్లలో జరుగుతున్న కుల వివక్ష పట్ల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖైదీలను కులవివక్ష ఆధారంగా వేరుగా చూడరాదని కోర్టు చెప్పింది. అన్ని కులాలకు చెందిన ఖైదీలను మానవత్వంతో, సమానంగా చూడాలని కోర్టు తెలిపింది. జైళ్లలో ఉన్న ఖైదీలకు పని విషయంలో సమాన హక్కు కల్పించాలని కోర్టు వెల్లడించింది. ప్రమాదకర పరిస్థితుల్లో ఉండే సీవేజ్ ట్యాంక్‌లను ఖైదీలు శుభ్రం చేసే అనుమతి ఇవ్వకూడదని కోర్టు చెప్పింది. రాష్ట్ర జైలు మాన్యువల్స్‌లో ఉన్న అభ్యంతరకర రూల్స్‌ను కోర్టు కొట్టిపారేసింది. మూడు నెలల్లోగా ఆ నియమావళిని సవరించాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఓ కులానికి చెందిన వ్యక్తులనే స్వీపర్లుగా ఎంపిక చేయడం సరైన విషయం కాదు అని కోర్టు చెప్పింది.

రైతులను మోసగిస్తే కఠిన చర్యలు..

-సన్నాల పేరిట గోల్ మాల్ కట్టడి..

-కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్ వీడియో కాన్ఫరెన్స్

టీ మీడియా, అక్టోబర్ 3 ,హైదరాబాద్:
రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేలా చూడాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇప్పటికే రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచే సన్నాలకు ఎమ్మెస్పీకి అదనంగా ఒక్కో క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుందని సీఎం స్పష్టం చేశారు. గత సీజన్ లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు మూడు రోజుల్లో డబ్బులు ఇచ్చామని, ఈసారి 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి గురువారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు జిల్లాల నుంచి ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సివిల్? సప్లయిస్? ఎండీ డీఎస్? చౌహాన్?, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్? రావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల కోసం ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 7 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు నెలకొల్పినట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే గుర్తించిన కేంద్రాలు కాకుండా.. ఎక్కడైనా కొనుగోలు కేంద్రం అవసరమని కలెక్టర్లు భావిస్తే అక్కడ కొత్త కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఈ వానాకాలంలో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారని, గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని సీఎం చెప్పారు.సన్న వడ్లకు బోనస్ ఇవ్వటం ఇదే మొదటిసారి కావటంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఎక్కడా ఎలాంటి తప్పుడు జరగకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందని అన్నారు. సన్నవడ్ల సేకరణకు వీలుగా వేర్వేరు కొనుగోలు కేంద్రాలు, లేదా కొనుగోలు కేంద్రాల్లో వేర్వేరు కాంటాలు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.సన్న వడ్లు కొనేటప్పుడు నిర్దేశించిన ప్రమాణాలు తప్పకుండా పాటించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు. సన్న రకాలను ధ్రువీకరించే యంత్రాలు, సిబ్బందిని అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని చెప్పారు. సన్న వడ్ల సేకరణలో అప్రమత్తంగా లేకపోతే గోల్?మాల్? జరిగే ప్రమాదం ఉందని సీఎం హెచ్చరించారు. అటువంటి తప్పులు, అవకతవకలు జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని చెప్పారు.
ప్రతి కేంద్రానికి ఒక నెంబర్ కేటాయించాలని, ఆ కేంద్రంలో కొనుగోలు చేసిన వడ్ల సంచులపైన ఆ నెంబర్ తప్పకుండా వేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దీంతో ఏ తప్పు జరిగినా, ఏ దశలో గోల్? మాల్? జరిగినా ఎక్కడ జరిగిందో సులభంగా తెలుసుకునే వీలుంటుందని చెప్పారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టడి చేయాలని పోలీస్ అధికారులను సీఎం అప్రమత్తం చేశారు. అన్ని మార్గాల్లోనూ పకడ్బందీగా నిఘా ఉంచాలని, చెక్ పోస్టుల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారుతాలు ,తరుగు, తేమ పేరు తో రైతులను మోసం చేసే వారిని సహించవద్దని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంట వెంటనే తరలించేందుకు తగిన రవాణా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రతి గంటకోసారి కొనుగోలు కేంద్రాలకు వాతావరణ శాఖ సూచనలను చేరవేయాలని, దానికి అనుగుణంగా కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతి రోజు కలెక్టర్లు తమ జిల్లాలో జరుగుతున్న కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షించాలని, ప్రతి రోజు ఉదయం నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి కేంద్రాలను పరిశీలించాలన్నారు.

ప్రారంభమైన ఇంటింటి సర్వే

-పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

టీ మీడియా, అక్టోబర్ 3, వనపర్తి బ్యూరో :
తెలంగాణ కుటుంబ గుర్తింపు కార్డు సర్వేలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించిన అంజనగిరీ, గ్రామము, వనపర్తి మున్సిపాలిటీ 10వ వార్డులో కుటుంబ వివరాల సేకరణ పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రత్యేక అధికారి జి. రవి నాయక్ ఆదేశించారు. వనపర్తి జిల్లాలో గురువారం నుండి ప్రారంభమైన ఇంటింటి సర్వేను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తో కలిసి పరిశీలించారు. ముందుగా అంజనగిరి గ్రామంలో పరిశీలించిన ఆయన మున్సిపాలిటీలోని 10 వ వార్డు నాగవరంలో సైతం పరిశీలించారు. జె. జయమ్మ అనే యజమాని ఇంటి వివరాల నమోదును ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రభుత్వం ద్వారా పోయినా డేటా బెస్ లో పరిశీలన చేశారా అని టీమ్ లీడర్ ను అడిగారు. డేటా బేస్ లో పేర్లు ఉన్న వారికి ఫారం 1 లో పేర్లు నమోదు చేసుకొని డేటా బేస్ లో పేర్లు లేని వారి వివరాలు ఫారం 2 లో నమోదు చేస్తున్నట్లు తహసిల్దార్ రాజు వివరించారు. వివరాలు డబుల్ కాకుండా జాగ్రత్తగా పరిశీలించి చేయాలని ప్రత్యేక అధికారి సూచించారు. మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, టీమ్ లీడర్లు తహసిల్దార్ రాజు, రమేష్ రెడ్డి సర్వేలో పాల్గొన్నారు.

సహృదయ దాతకు హృదయ పూర్వక ధన్యవాదాలు

టీ మీడియా, అక్టోబర్ 3, వనపర్తి బ్యూరో :
వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యాపర్ల పూర్వ విద్యార్థి ఎన్నారై శ్రీహరి రెడ్డి గురువారం పాఠశాలను సందర్శించారు.
జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి అన్నారు పెద్దలు . కన్నతల్లి కన్న ఊరు స్వర్గం కంటే గొప్ప అని దీని భావం.అలాగే తనను కన్న తల్లిలా ఆదరించి జ్ఞానాన్ని ప్రసాదించిన చదువుల తల్లి గుడి కూడా అంతే గొప్పదని భావించిన సహృదయ సంపన్నులు మన యాపర్ల గ్రామ వాస్తవ్యులు సూదిరెడ్డి శ్రీహరి రెడ్డి తండ్రి శ్రీ నరేందర్ రెడ్డి ప్రేమ,వాత్సల్యంతో ఎదిగిన శ్రీహరి రెడ్డి ఈ పితృ పక్షాలలో తమ పెద్దలను స్మరించుకోవడానికి (పెద్దల పండుగకు)మన గ్రామానికి వచ్చినపుడు తాను చదువుకున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తరతరాలు విద్యనభ్యసించవలసిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడం చూసి చలించి పోయారు.భవనాన్ని పటిష్ట నిర్మాణం పెయింటింగ్ మరమ్మతుల కోసం బోర్ మోటార్,పాఠశాల ఫర్నిచర్ చేపట్టడం కోసం పూర్తి ఖర్చుకు అయిన డబ్బులు ఇస్తాను అన్నారు. దసరా వరకు పనులను పూర్తి చేస్తామన్నారు. వెంటనే అడ్వాన్స్ గా రూ.50,000/- లు గ్రామ పెద్దలకు అందజేశారు. దసరా పండుగ వరకు పనులను పూర్తి చేస్తామన్నారు అవసరమైతే మరింత డబ్బును కూడా అందజేస్తానని హామీ ఇచ్చారు.కన్న తల్లి ఋణం తీర్చుకున్నట్లుగా చదువుల తల్లి కోవెల ఋణం తీర్చుకుంటున్న శ్రీ సూదిరెద్ది శ్రీహరి రెడ్డికి ప్రధానోపాధ్యాయులు పలుస శంకర్ గౌడ్, మాజీ సర్పంచ్ విక్రమ్ గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జయమ్మ, రైతు సంఘం నాయకుడు స్వరాజ్యం బాబు రెడ్డి, ఉపాధ్యాయులు మొహినొద్దీన్, వెంకటేశ్వర్లు, ఈశ్వర్ రెడ్డి, బాలమ్మ, శ్రీధర్, కవిత , శివాని, తల్లిదండ్రులు ,ఉపాధ్యాయుల పక్షాన,గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రుల పక్షాన హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

మణిపూర్‌లో ఇద్దరు బంధీల విడుదల.

-తొలిసారి హత్తుకున్న మైతీ, కుకీలు

టీ మీడియా, అక్టోబర్ 3 ఇంఫాల్:
జాతుల మధ్య ఘర్షణలతో రగులుతున్న మణిపూర్‌లో అరుదైన సంఘటన జరిగింది. పొరపాటున కుకీ ప్రాంతంలోకి ప్రవేశించిన మైతీ యవకులను ప్రాణాలతో విడిచిపెట్టారు. ఈ నేపథ్యంలో ఘర్షణలు మొదలైన తర్వాత తొలిసారి మైతీ, కుకీ సభ్యులు ఒకరినొకరు హత్తు కున్నారు. సెప్టెంబర్ 27న మైతీ వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మరో మైతీ వ్యక్తితో కలిసి జనరల్ డ్యూటీ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షకు హాజరయ్యేందుకు అస్సాం రైఫిల్స్ క్యాంప్‌నకు బయలుదేరారు. అయితే గూగుల్ మ్యాప్స్‌పై ఆధారపడిన వారు పొరపాటున కాంగ్‌పోక్పిలోని కుకీ ఆధిపత్య గ్రామంలోకి ప్రవేశించారు. ఈ నేపథ్యంలో కుకీ గ్రామ వలంటీర్లు వారిని నిర్బంధించారు. ఒక వ్యక్తిని తర్వాత విడుదల చేశారు.కాగా, ఇద్దరు మైతీ వ్యక్తుల నిర్బంధం గురించి సీఎం బీరెన్ సింగ్ దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో వారి విడుదల కోసం అన్ని ప్రయత్నాలు చేశారు. కాంగ్‌పోక్పి జిల్లాలోని కుకీ సివిల్ సొసైటీ గ్రూప్ కమిటీల గిరిజన ఐక్యత సంఘం (సీవోటీయూ) మధ్యవర్తిత్వం వహించింది. ఇరు వర్గాలతో చర్చలు జరిపింది. ఇంఫాల్ జైలులో ఉన్న కుకీ-జో ఖైదీలందరినీ వారి ఆధిపత్య ప్రాంతమైన చురచంద్‌పూర్‌కు తరలించాలని, కాంగ్‌పోక్పి జిల్లాలోని ఫైలెంగ్‌మోంగ్‌లో కొత్త పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలని ఇద్దరు మైతీలను నిర్బంధించిన కుకీ గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు.మరోవైపు ప్రభుత్వంతో చర్చల తర్వాత ఇంఫాల్ జైలులో ఉన్న కుకీ, జో వర్గాలకు చెందిన 11 మందిని సపర్మీనాలోని జైలుకు తరలించారు. అలాగే ఫైలెంగ్‌మాంగ్‌లో పోలీస్ స్టేషన్‌ను రెండు, మూడు రోజుల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ నేపథ్యంలో నిర్బంధంలో ఉన్న ఇద్దరు మైతీ వ్యక్తులను కుకీ గ్రామ వలంటీర్లు విడుదల చేశారు.కాగా, విడుదల చేసిన ఇద్దరు మైతీ వ్యక్తులను కుకీ సివిల్ సొసైటీ గ్రూప్ గురువారం పోలీసులకు అప్పగించింది. ఈ సందర్భంగా ఈ రెండు జాతుల మధ్య ఘర్షణలు మొదలైన 17 నెలల తర్వాత మైతీ, కుకీ సభ్యులు తొలిసారి ఒకరినొకరు హత్తుకున్నారు. మైతీ యువకులు సురక్షితంగా తిరిగి వచ్చేందుకు కృషి చేసిన కేంద్ర, రాష్ట్ర అధికారులకు సీఎం బీరెన్ సింగ్ ధన్యవాదాలు తెలిపారు.

చేపల పెంపకంతో మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి

-మంత్రి పొన్నం ప్రభాకర్

-లోయర్ మానేరులో చేప పిల్లల విడుదల

టీ మీడియా, అక్టోబర్ 3 ,కరీంనగర్ :
చేపల పెంపకంతోనే మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం ఫిషరీస్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అధ్యక్షతన లోయర్ మానేరు డ్యాంలో చేప పిల్లలను విడుదల చేశారు. తొలుత గంగమ్మ తల్లికి మంత్రి పొన్నం పూజలు చేసి చేప పిల్లలను విడుదల చేశారు. చేప పిల్లలు ఎంత ఉత్పత్తి జరిగితే అంతమేర మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు.

కుల వృత్తిదారుల సంక్షేమమే సీఎం ధ్యేయం

%కుల వృత్తిదారుల సంక్షేమమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్యేయమని మంత్రి పొన్నం అన్నారు. సీఎం కృషి వల్ల చేప పిల్లల విడుదల కార్యక్రమం చేపట్టామని చెప్పారు. మానేరులో 30లక్షల చేప పిల్లలు కాదు 60లక్షల చేప పిల్లల కేపసిటీ ఉందన్నారు. ఈ ప్రాంతంలో చేప పిల్లల ఉత్పత్తి లో కరీంనగర్ ఉత్తర తెలంగాణ లోనే పెద్దదన్నారు. హుస్నాబాద్ లో అన్ని చెరువుల్లో కూడా చేప పిల్లలు పంపిణీ కి మూడు జిల్లాల అధికారులతో మాట్లాడి ఉపాధి కల్పించేలా చేస్తున్నామన్నారు.

కోల్డ్ స్టోరేజీలు పెట్టుకుంటామంటే రాయితీ రుణాలు..

చేప పిల్లల ఉత్పత్తి చేసి ఉపాధి పెంచుకునే వారికి అండగా ఉంటామని, కోల్డ్ స్టోరేజ్ లు పెట్టుకుంటామంటే సబ్సిడీ ద్వారా రుణాలు ఇస్తామని మంత్రి పొన్నం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా ఫిష్ ఎక్స్పోర్ట్ కూడా చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మేయర్ సునీల్ రావు, ఫిషరీస్ కమిషనర్ ప్రియాంక ఆలా, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు రోజులపాటు భారీ వర్షసూచన

టీ మీడియా, అక్టోబర్ 3 ,హైదరాబాద్:
రాష్ట్రంలో మరో మూడురోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలుపడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిసిన సమాచారం మేరకు శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాలలో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.శనివారం నిజామాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల వానలు కురుస్తాయని పేర్కొంది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం పడింది. భారీగా కురిసిన వానతో నగరవాసులు తడిసి ముద్దయ్యారు. వర్షానికి వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని బేగంబజార్, కోఠి, సుల్తాన్ బజార్, అబిడ్స్, బషీర్ బాగ్, నాంపల్లి, లిబర్టీ, హిమాయత్ నగర్, లక్డీకాపుల్ ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి.రోడ్లపై వాన నీరుతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జోరుగా వర్షం కురిసింది. ఇందిరా పార్కు ధర్నా చౌక్, బాగ్ లింగంపల్లి, లోయర్ ట్యాంక్‌బండ్, ఆర్టీసీ క్రాస్ రోడ్, గాంధీ నగర్, జవహర్ నగర్, కవాడిగూడ, దోమలగూడ తదితర ప్రాంతాల్లో జోరుగా వర్షం కురిసింది.బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద వరద నీరు నిలిచింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉద్యోగం ముగించుకుని ఇంటికి బయలు దేరిన ఉద్యోగులు, విద్యార్థులు వర్షానికి తడిచిపోయారు.మరోవైపు హైదరాబాద్‌కు ఎల్లో హెచ్చర

సనాతన ధర్మం పరిరక్షణకు బలమైన చట్టాన్ని తీసుకురావాలి

-డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

టీ మీడియా,అక్టోబర్ 3,అమరావతి :

దేశంలో సెక్యులరిజం పేరుతో హిందువుల నోరు నొక్కేస్తున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం పరిరక్షణకు బలమైన చట్టాన్ని కేంద్రం తీసుకువచ్చి పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా తిరుపతిలో గురువారం నిర్వహించిన వారాహి బహిరంగ సభలో కేంద్రానికి పలు సూచనలు చేస్తూ డిక్లరేషన్ ను విడుదల చేశారు.ఏ మతానికి, ధర్మానికి భంగం కలిగినా ఒకేలాగా స్పందించేలా బలమైన చట్టం తీసుకురావాలని కోరారు. సనాతన ధర్మ పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని దానికి ప్రతి సంవత్సరం కేంద్రం నిధులు విడుదల చేయాలని సూచించారు. అన్ని ఆలయాల్లో ప్రసాదంలో వినియోగించే నాణ్యమైన వస్తువులు సరఫరా చేసి ధ్రువీకరించే విధానాన్ని తీసుకురావాలని పేర్కొన్నారు. ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా, విద్యా, కళా, ఆర్థిక, పర్యావరణ, కేంద్రాలుగా తయారు చేయాలని కోరారు.

సనాతన ధర్మంపై దాడులు జరిగితే స్పందించరెందుకు ?

ఇతర మతాల గురించి ఎవరైనా మాట్లాడితే నటులు, చిత్రపరిశ్రమ, వ్యాపారస్తులు అందరూ మాట్లాడుతారని, సనాతన ధర్మంపై దాడులు జరిగితే ఒక్కరూ స్పందించరని ఆరోపించారు. ఈ మధ్య దేశంలో హిందూ దేవుళ్లకు వ్యతిరేకంగా చాలా దాడులు జరిగాయని పేర్కొన్నారు. ఈ దేశానికి వెన్నముక శ్రీరాముడని అన్నారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని వెల్లడించారు. ప్రకృతిలోని ప్రతిజీవి సుఖంగా ఉండాలని సనాతన ధర్మం కోరుకుంటుందని, సనాతన ధర్మంపై దాడులు జరిగితే ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా ధైర్యంగా గొంతు విప్పాలని కోరారు. నేను సనాతన ధర్మాన్ని పాటిస్తే అవహేళన చేసి మాట్లాడుతున్నారు. నా ప్రాయశ్చిత్త దీక్షను కూడా అవహేళన చేశారని మండిపడ్డారు. సనాతన ధర్మం ఎప్పుడూ మనుషులు ఒక్కరే సుఖంగా ఉండాలని కోరుకోదని అన్నారు. సనాతన ధర్మాన్ని అంతం చేయాలని కొంతమంది అనుకుంటున్నారని, హిందువులంతా ఏకమయ్యే సమయం వచ్చిందని వెల్లడించారు. హిందూ సమాజంలో ఐక్యత లేకపోవడమే సనాతన ధర్మంపైనా దాడులకు కారణమని అన్నారు. హిందూ సమాజాన్ని కులాలు, ప్రాంతాల వారీగా విభజించారని, మన మతం గురించి మాట్లాడుకోవాలంటేనే భయపడే పరిస్థితికి వచ్చామని అన్నారు. సెక్యులరిజం అనే పేరుతో హిందువుల నోరు నొక్కేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరూ డయాబెటిస్ పరీక్ష చేయించుకోవాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాకేష్ రెడ్డి

టీ మీడియా, అక్టోబర్ 3, వనపర్తి బ్యూరో:

వనపర్తి జిల్లా , వనపర్తి మండలం కదుకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అప్పాయి పల్లి, కిర్య తాండ, చిట్యాల పడమటి తండాలలో ఇంటింటి డయాబెటిస్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రారంభించి 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి డయాబెటిస్ రక్త పరీక్ష చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ రామచంద్రరావు జిల్లా ఎన్సిడి ప్రోగ్రాం అధికారి , కదుకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాకేష్ రెడ్డి పర్యవేక్షించి పరిశీలించడం జరిగింది. ప్రజలందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకుని ప్రతి ఒక్కరూ డయాబెటిస్ పరీక్ష చేయించుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహేశ్వర చారి, శ్రీనివాస్ కొండ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు, చంద్రకళావతి, జయప్రద సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

మేఘన్న అభయ హస్తం ద్వారా ఆర్థిక సాయం

టీ మీడియా, అక్టోబర్ 3, వనపర్తి బ్యూరో :

వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ 18 వ వార్డులో మరణించిన ఆది చెన్నమ్మ కుటుంబానికి 5000 /- రూపాయలు ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి . చెన్నమ్మ మరణం స్థానిక కౌన్సిలర్ సత్యమ్మ శరవంద , టిపిసిసి వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్ ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి కి సమాచారం ఇవ్వగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్ , ద్వారా ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. కౌన్సిలర్ చంద్రకళ ఎల్ఐసి కృష్ణ విశ్వం బాబు అందరు కలిసి మరణించిన ఆది చెన్నమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇవ్వడం జరిగింది.

పాలం పిలుస్తోంది కార్యక్రమం

టీ మీడియా, అక్టోబర్ 3, పెద్ద దోర్నాల

:పెద్ద దోర్నాల మండలం లోని చింతల మరియు బోడేనాయక్ తండా గ్రామాలలో వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వ్యవసాయ అధికారి ముందు గా గ్రామాలలో సాగు చేసిన ప్రత్తి, మిరప పంట లను క్షేత్ర సందర్శన చేసి రైతులకు పంటల పై సస్య రక్షణ చర్యలు గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు పరిపూర్ణ, నీలా నాయక్, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ బాలు నాయక్, గ్రామల రైతులు పాల్గొన్నారు.

ఈషా ఫౌండేషన్‌పై పోలీసుల యాక్షన్‌కు బ్రేక్..

టీ మీడియా, అక్టోబర్ 3 ,న్యూఢిల్లీ: :

సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు చెందిన ఈషా ఫౌండేషన్‌పై పోలీసుల చర్యలకు బ్రేక్ వేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈషా ఫౌండేషన్‌తో లింకున్న అన్ని క్రిమినల్ కేసుల వివరాలను వెల్లడించాలని మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో తమిళనాడు పోలీసులు చర్యలకు దిగారు. ఈ నేపథ్యంలో ఈషా ఫౌండేషన్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మద్రాసు హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే ఇచ్చింది. కోయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్ ఆశ్రమంలో ఉన్న తన ఇద్దరు కూతుళ్లకు బ్రెయిన్‌వాష్ చేశారని, దాంతో వాళ్లు ఇంటికి రావడం లేదని ఓ తండ్రి దాఖలు చేసిన పిటీషన్ ఆధారంగా హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఇవాళ ఈ కేసులో వాదనలు విన్నది. ఆ ఇద్దరు మహిళలతో ధర్మాసనం మాట్లాడింది. తమ ఇష్టపూర్వకంగానే ఆశ్రమంలో ఉంటున్నట్లు ఆ ఇద్దరు మహిళలు వెల్లడించారు. తమను ఎవరూ నిర్బంధించడంలేదని పేర్కొన్నారు. ఈషా ఫౌండేషన్‌పై నమోదు అయిన కేసును మద్రాసు హైకోర్టు నుంచి సుప్రీంకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. తమిళనాడు పోలీసులు ఇచ్చే స్టేటస్ రిపోర్టును సుప్రీంకు సమర్పించాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

టీ మీడియా, అక్టోబర్ 3, మహానంది:

మహానంది పుణ్యక్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు.గురువారం మహానందిలో నూతన నవరాత్రి యాగశాల, నిచ్చితార్థ మండపం నిర్మాణం, కోనేరుల మరమత్తుల పనులను ప్రారంభించారు. ముందుగా మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఈవో శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త బన్నురు రామలింగారెడ్డి, ఈవో నల్లకాలువ శ్రీనివాస రెడ్డి, టిడిపి నాయకులు నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి, జనసేన మండలాధ్యక్షుడు మారెడ్డి రామయ్య, అధికారులు, టిడిపి నాయకులు,ఆలయ అధికారులు, వేద పండితులు, సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

టీ మీడియా, అక్టోబర్ 3, మహానంది:

నంద్యాల గిద్దలూరు జాతీయ రహదారి నల్లమల ఘాట్ రోడ్డులోని శ్రీ సర్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలు అయిన ఘటన గురువారం జరిగింది. రోడ్డు భద్రత విభాగం సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, గాయపడిన యువకుడిని 108 వాహనంలో నంద్యాల ఆసుపత్రికి తరలించారని ప్రయాణికులు తెలిపారు. గాయపడిన యువకుడు ప్రకాశం జిల్లా కంభం మండలం చెందిన షేక్ అలీ భాష అని సమాచారం.

జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

టీ మీడియా,అక్టోబర్ 3, కరక గూడెం:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరక గూడెం మండలం మోతె గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ముదురు కోళ్ల వెంకన్న మనువడు రుత్విక్ మొదటి జన్మ దిన వేడుకలో పాల్గొని బాలుడికి అక్షింతలు వేసి ఆశీర్వదించినారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఎర్ర సురేష్ గౌడ్ ,పోలెబోయిన తిరుపతయ్య ,తోలెం నాగేశ్వర రావు,కరకపల్లి నాగేష్,సూర సంతోష్, బీలపాటి సంపత్ కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు

వాహన తనిఖీలు చేపట్టిన ఎస్సై

టీ మీడియా, అక్టోబర్ 3, పెద్ద దోర్నాల

:పెద్ద దోర్నాలలోని శ్రీశైలం బస్టాండ్ లో సాధారణ తనిఖీల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేశారు, ద్విచక్ర వాహనదారులు లైసెన్సులు కలిగి ఉండాలని, తప్పనిసరిగా హెల్మెట్ దరించి వాహనాలు నడపాలని సూచించారు, అనంతరంపరిమితికి మించి శ్రీశైలం దైవ దర్శనార్థం వెళ్తున్న భక్తుల వాహనాలు తనిఖీ చేసిధ్రువపత్రాలు పరిశీలించారు,టాటా ఏసీ ట్రాలీ వాహనంలో పరిమితికి మించి భక్తులు ప్రయాణించటంతో వాహనానికి అపరాధ రుసుము విధించారు, అధిక లోడుతో ఇలా ఘాట్ రోడ్లో ప్రయాణిస్తే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయనిమందలించారు,ఈ కార్యక్రమంలోఎస్ఐ మహేష్,పోలీస్ సిబ్బంది,శ్రీనివాసులు,నారాయణ,యాసీన్,తదితరులు పాల్గొన్నారు,

ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్

- జిల్లా ఎస్పీరావుల గిరిధర్

టీ మీడియా, అక్టోబర్ 3, వనపర్తి బ్యూరో :

వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న పిసి 2398 రాకేష్ హైదరాబాద్ కు గణేష్ బందోబస్తు వెళ్లి బందోబస్తు పూర్తయిన తర్వాత తిరిగి మళ్ళీ పోలీస్ స్టేషన్లో రిపోర్టు చేయనందున , సి సి ఏ రూల్స్ ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం (బిజినెస్) చేస్తున్నందున పోలీసు కానిస్టేబుల్ రాకేష్ ను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా పానగల్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న పిసి 2234 రామకృష్ణ ఎక్కువ అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి, అధికారుల నుండి ఎటువంటి అనుమతి లేకుండా, విధులకు హాజరుకానందున పోలీసు కానిస్టేబుల్ రామకృష్ణ ను శాఖపరమైన క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అంతర్గత విచారణలో ఉద్యోగుల తప్పిదం ఉందని ఉద్యోగులను విధుల నుండి తొలగిస్తూ(సస్పెండ్ చేస్తూ) జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు అధికారుల పనితీరును, సమాజంలో వారి ప్రవర్తనను పోలీస్ శాఖ నిశితంగా పరిశీలిస్తుందని, పోలీస్ శాఖలో పనిచేస్తూ ఇలాంటి చర్యలను ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ తెలిపారు.

నీలం మధు ముదిరాజ్'కు ఆహ్వానం

టి.మీడియా ,అక్టోబర్ 3 ,జిన్నారం

:మండలం.బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో దేవి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గామాత పూజ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాష్ట్ర నాయకులు, మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాండేట్ నీలం మధు ముదిరాజు గారిని "మా అంభి మహిళా సేవా సమితి" తరఫున రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాలకు తప్పకుండా హాజరై అమ్మవారిని దర్శించుకుంటానని నీలం మధు ముదిరాజ్ కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మా అంబి మహిళా సేవా సమితి సభ్యులు దినానాథ్ రాజారామ్ శ్రీమన్నారాయణ లక్కన్ ఉద్యానంద్ తివారీ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

జయ ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుక

టీ మీడియా, అక్టోబర్ 3 ,కొణిజర్ల:

స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాల నందు 2వ రోజైన బతుకమ్మ పండుగ చాలా ఘనంగా నిర్వహించారు. కళాశాల మహిళ అధ్యాపకుల పర్యవేక్షణ లో విద్యార్థినులు బతుకమ్మని పేర్చి, బతుకమ్మ పాట కోలాటాలతో , బతుకమ్మ నృత్యాలతో సాంప్రదాయబద్ధంగా బతుకమ్మ ని కన్నుల పండగ ఈ బతుకమ్మ కళాశాల ఆవరణలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది అని విద్యార్థులు తెలిపారు. కళాశాల వైస్ చైర్ పర్సన్ పి విజయలక్ష్మి విద్యార్థినులను మహిళా సిబ్బందిని అభినందించారు, వారికి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. తమ కళాశాలలో చదువుతున్న, మరియు పని చేస్తున్న ప్రతి ఒక్క ఫ్యామిలీకి విజయం చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి చిన్నయ్య, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ఏ ఓ ఫరీద్ బాబా వివిధ విభాగాల అధిపతులు ఫ్యాకల్టీ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనుచరుల విధ్వంసం..

-రెండు పవర్ విద్యుత్ స్టేషన్లపై దాడి

-కార్యాలయ ఫర్నిచర్, కంప్యూటర్ల ధ్వంసం

టీ మీడియా, అక్టోబర్ 3 ,కర్నూలు బ్యూరో :



ఆలూరులో వైసీపీ ఎమ్మెల్యే విరుపాక్షి సోదరుడు, ఆయన అనుచరులతో కలిసి ఆలూరులో రెచ్చిపోయారు. మొలగవల్లి గ్రామం జోహరపురం సమీపంలో విండ్ పవర్ సబ్ స్టేషన్ పై ఎమ్మెల్యే విరూపాక్షి అనుచరులు దాడికి తెగబడ్డారు. అడ్డువచ్చిన పవర్ స్టేషన్ అధికారులను చితకబాదారు.కంప్యూటర్లు, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. వచ్చి కలవమంటే ఎమ్మెల్యేకి ఎదురు సమాధానాలు చెబుతారా.. ప్రాణాలు తీస్తామంటూ సిబ్బందిని బెదిరించారు. విండ్ పవర్ వ్యవహారంలో ఎమ్మెల్యే విరూపాక్షి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు నారాయణల మధ్య వివాదం కొనసాగుతున్నట్లు సమాచారం.-దీంతో స్థానిక ఎమ్మెల్యేని కలవకుండా విధులు నిర్వహిస్తారా అంటూ అధికార, సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేశారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే పిలిచినా కలవరా.. అంటూ కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసం చేశారని విద్యుత్ సంస్థ ఉద్యోగులు ఆరోపించారు.అంతకుముందు దేవనకొండ మండలంలోని విండ్ పవర్ స్టేషన్ పై కూడా ఎమ్మెల్యే అనుచరులు దాడి చేశారు. విషయం తెలియగానే పోలీసులు ఘటన స్థలికి చేరుకొని దాదాపు 24 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దాడికి పాల్పడిన నిందితులను ఆలూరుకు తరలించారు. దేవనకొండ మండలం జిల్లె బుడకల గ్రామంలోని విండి పవర్ స్టేషన్ పై కూడా దాడికి దిగారు.

హెచ్‌సీఏలో

అయిన అజారుద్దీన్.. గురువారం ఈడీ ముందు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. హెచ్‌సీఏలో 20 కోట్ల మోసం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో ఈడీ విచారణ చేపడుతున్నది. ఇదే కేసులో మాజీ క్రికెటర్లు అర్షద్ అయూబ్, శివలాల్ యాదవ్‌లను గత డిసెంబర్‌లో విచారించారు.హెచ్‌సీఏ కేసులో మాజీ మంత్రి, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జీ వినోద్‌ను కూడా ఈడీ ప్రశ్నించింది. గత ఏడాది నవంబర్‌లో వినోద్, శివలాల్ యాదవ్, అర్షద్ అయూబ్ ఇండ్లల్లో ఈడీ సోదాలు కూడా చేపట్టింది. మనీల్యాండరింగ్ చట్టం కింద 9 ప్రదేశాల్లో తనిఖీలు జరిగాయి. ఏసీబీ నమోదు చేసిన మూడు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ విచారణ మొదలుపెట్టింది. ఉప్పల్ స్టేడియం కోసం డీజీ సెట్లు, ఫైర్‌ఫైటింగ్ సిస్టమ్స్, కెనోపీల ఖరీదులో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.గత ఏడాది అక్టోబర్‌లో అజారుద్దీన్‌పై నాలుగు క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. సుమారు 3.85 కోట్ల నిధుల్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉప్పల్ పోలీసు స్టేషన్‌లో ఆ కేసులు బుక్ చేశారు. చీటింగ్, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర కింద అజార్‌పై కేసులు పెట్టారు. హెచ్‌సీఏకు చెందిన నాలుగు కేసుల్లోనూ గతంలో సిటీ కోర్టు అజార్‌కు బెయిల్ మంజూరీ చేసింది. 2019లో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజార్ ఎన్నికయ్యారు. ఆయన 2023 ఫిబ్రవరి వరకు ఆ బాధ్యతలు నిర్వర్తించారు.

లాయర్‌పై పోలీసుల దాడి..

-డీజీపీ ఆఫీసు ముందు న్యాయవాదుల బైఠాయింపు

టీ మీడియా,అక్టోబర్ 3,హైదరాబాద్ :

మూసీ నిర్వాసితులకు కేటాయించబడిన డబుల్ బెడ్రూం ఇండ్లను గతంలోనే తమకు కేటాయించారు కొంత మంది బాధితులు కోర్టును ఆశ్రయించారు. ఈ బాధితుల తరపున న్యాయవాది ఎంఏ కలీమ్ కోర్టులో పోరాడుతున్నారు. అయితే కలీమ్‌ను టార్గెట్ చేసిన పోలీసులు, అతని ఇంట్లోకి వెళ్లి దాడి చేశారు. అంతటితో ఆగకుండా ఓ వాహనంలో ఎక్కించుకుని బయటకు తీసుకెళ్లి హింసించారు. అసభ్యకరమైన పదజాలంతో తనను దూషించారని బాధిత న్యాయవాది పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఎంఏ కలీమ్‌పై దాడికి పాల్పడ్డ మాదన్నపేట పోలీసులను సస్పెండ్ చేయాలని కోర్టు ముందు లాయర్లు ధర్నాకు దిగారు. లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయాన్ని కూడా న్యాయవాదులు ముట్టడించి నిరసన తెలిపారు. దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. న్యాయవాదులు డీజీపీ కార్యాలయం వద్ద రోడ్డుపై బైటాయించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.గత కొంత కాలంగా న్యాయవాదులపై అనేక దాడులు జరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని లాయర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకొచ్చి అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కలీమ్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని లాయర్లు హెచ్చరించారు.మూసీ నిర్వాసితులకు కేటాయించబడిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను గతంలోనే మాకు కేటాయించారు అని కోర్టును ఆశ్రయించిన బాధితులుముందుగా కేటాయించిన వాళ్ళ కోసం కోర్టులో పోరాడుతున్న ఓ లాయర్‌పై దాడి చేసిన పోలీసులు.పోలీసులను సస్పెండ్ చేయాలని కోర్టు ముందు ధర్నాకు దిగిన లాయర్లు.

చేనేత కార్మికుల భారీ ధర్నా

టీ మీడియా,అక్టోబర్ 3,రాజన్న సిరిసిల్ల :

కాంగ్రెస్ పాలనలో చేనేత కార్మికులురోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. తాజాగా సిరిసిల్ల నేత కార్మికులు ఆందోళనకు దిగారు. ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బీవైనగర్‌లో చేనేత జౌళిశాఖ ఎదుట భారీ ధర్నాచేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వం ఎనిమిదేండ్లుగా బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ఇవ్వడం వల్ల వేలాది మంది కార్మికులకు చేతి నిండా పని లభకాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల తయారీ బంద్ చేయడం వల్ల ఉపాధి పనిలేక అనేక కుటుంబాలు పస్తులు ఉంటున్నాయన్నారు. వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధార పడ్డ వేలాది మంది కార్మికుల కుటుంబాలు నేడు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయన్నారు. కార్మికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం బాధాకరమన్నారు.కార్మికులకు రావాల్సిన యారన్ సబ్సిడీ బకాయిలు విడుదల చేయాలని పలుమార్లు కలెక్టర్, మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. వెంటనే యారన్ సబ్సిడీ విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వర్కర్‌టూ ఓనర్ పథకాన్ని అమలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, నక్క దేవదాస్, కూచన శంకర్, మల్లారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

భారీగా అల్ఫాజోలం, క్లోరోహైడ్రేట్ పట్టివేత

టీ మీడియా,అక్టోబర్ 3,నిర్మల్ :

నిర్మల్ జిల్లా కేంద్రంలో రూ.43 లక్షల విలువ చేసే అల్ఫాజోలం క్లోరోహైడ్రేట్‌ను ఎక్సైజ్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. అల్ఫాజులం, క్లోరోహైడ్రేట్ నిల్వ చేశారనే విశ్వసనీయ సమాచారం మేరకు నిర్మల్‌లోని ద్వారకా నగర్‌లో గంధం శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో సోదాలు చేపట్టారు. అతడి వద్ద నుంచి 3.3 కిలోల అల్ఫాజోలం, అలాగే శాంతినగర్‌లోని ఓ గోదాంలో నిల్వ చేసిన 728 క్లోరోహైడ్రేట్ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు.నిందితుడు గంధం శ్రీనివాస్ గౌడ్‌కు సోలాపూర్ శీను అలియాస్ భాయ్ అల్ఫాజులంను, రాజస్థాన్‌కు చెందిన రూప్ సింగ్ అనే వ్యక్తి క్లోరోహైడ్రేడ్‌ను గత కొంతకాలంగా సప్లై చేస్తున్నారు. వీటితో శ్రీనివాస్ గౌడ్ కల్తీకల్లు వ్యాపారం చేయడమే కాకుండా అల్ఫాజోలం, క్లోరోహైడ్రేట్‌ను ఇతరలకు అమ్ముతున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గీత దాటితే వేటు

తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్(%బా%), పెన్ పహాడ్, వాడపల్లి, హాలియా, ఎస్ఐలను వి ఆర్ లో పెట్టారు. వీరిలో కొందరికి ఇసుక అక్రమ రవాణాలో ప్రత్యక్షంగా, పరోక్ష సహకారం ఉండటంతో వారిపై డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఐజీ సత్యనారాయణ పేర్కొన్నారు. త్వరలో వీరిని లూప్ లైన్‌కు ట్రాన్స్‌ఫర చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర నిఘా అధికారుల నివేదికలు, ఇతర ఎంక్వయిరీల ఆధారంగా ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని వెల్లడించారు.ప్రధానంగా ఇసుక అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. అదేవిధంగా వాగుల్లో, నిషేధిత నది ప్రాంతాలలో ఎక్కడబడితే అక్కడ విచక్షణ రహితంగా ఇసుకను తవ్వకాలు జరుగుతున్నాయి. అదేవిధంగా పర్యావరణ సమతుల్యానికి భంగం వాటిల్లే అవకాశం ఉండటంతో ప్రభుత్వం, రాష్ట్ర డీజీపీ ఈ విషయంలో సీరియస్‌గా ఉండడంతో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని ఐజీ తెలిపారు. ఇప్పటి నుండి ఎక్కడ కూడా ఇసుక అక్రమ రవాణా జరిగితే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉం